## బాధిత కుటుంబాలకు పరామర్శ



తాంసి: మలపతి స్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి(తలమడుగు), మార్చి 17 : తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన మలపతి స్వామి రోడ్డు ప్రమాదంలో, కప్పర్ల గ్రామానికి చెందిన మల్లెల అక్షయ్ విద్యుత్ షాక్‌తో, తలమడుగు మండలంలోని మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి నానమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ, బీఆర్ఎస్ నాయకులు వెంకటరమణ, మాజీ సర్పంచ్‌లు అశోక్, కేమ సదానందం, సుభాష్, చంటి ఆశన్న, విలాస్, మహేందర్, చంద్రయ్య, రవికాంత్, అభిరాంరెడ్డి, కల్చప్ యాదవ్, నాగిరెడ్డి, అరుణ్‌కుమార్ ఉన్నారు.

### కెరీర్ గైడ్‌లైన్స్ సెంటర్ ప్రారంభం

బోథ్, మార్చి 17: మండల కేంద్రంలో విశ్రాంత అధ్యాపకులు, పోటీ పరీక్షల నిపుణులు ఏర్పాటు చేసిన యూటర్న్ కెరీర్ గైడ్‌లైన్స్ కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రారంభించారు. కార్యక్రమంలో బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్‌లాల్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, సురేందర్‌యాదవ్, డాక్టర్ రవీంద్ర ప్రసాద్, రమణాగౌడ్, మహేందర్, జీవన్ రెడ్డి, గంగయ్య, రమేశ్‌బాబు, సదానందం, నిర్వాహకులు పాల్గొన్నారు.

## వాహన చోదకులకు ఇక్కట్లు



నార్నూర్ గాంధీ చౌరస్తా వద్ద ఇరుక్కుపోయిన 16 చక్రాల లారీ

నార్నూర్, మార్చి 17 : మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద బస్సులు, లారీ, టిప్పర్లు వంటి వాహనచోదకులు తమ వాహనాలను మలుపుకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. చౌరస్తాపై రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో పెద్ద వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. ఆదివారం 16 చక్రాల లారీ ఇరుక్కుపోవడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడింది. ప్రమాదం కూడా తప్పిందని చర్చించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## నవజాత శిశువును వదిలిన బాధ్యుల ఆచూకీ

తాంసి(భీంపూర్), మార్చి 17 : భీంపూర్ మండలం నిపాని గ్రామ శివారులో చెట్ల పొదల్లో ఈ నెల 13వ తేదీన ఉదయం నవజాత శిశువు లభించిన విషయం తెలిసిందే. పోలీసులు అప్పుడు పసికందుకు వైద్య పరీక్షలు చేయించి దర్యాప్తు చేపట్టారు. ఐసీపీఎస్ శిశు గృహాలో ప్రస్తుతం మగబిడ్డ సురక్షితంగా ఉన్నది. ఈ కేసులో పోలీసులు పక్కా దర్యాప్తు చేసి వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని బేల్సరిరాంపూర్ గ్రామానికి చెందిన ధనరాజ్ అనే యువకుడు బంధుత్వంలో ఓ మైనర్ బాలికను మోసగించి గర్భవతి చేసినట్లు వెల్లడయింది. ఈ మేరకు పోలీసులు బాధ్యుడిని అదుపులోకి తీసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు భీంపూర్ ఎస్ఐ ప్రదీకుమార్ తెలిపారు.

# అగ్నిమాపక కేంద్ర భవనం కలేనా..!

- మూడు సార్లు నిధులు వెనక్కి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ఉట్నూర్, మార్చి 17: ఏజెన్సీ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రానికి పక్కా భవనం కలగానే మిగిలింది. ఉట్నూర్ ఏజెన్సీ పరిధిలోని గ్రామాల్లో గిరిజన రైతులకు విపత్తుల నుంచి పంటలు, ఇండ్లను రక్షించుకోడానికి ప్రభుత్వం 2004 సంవత్సరంలో అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసింది. కాని దానికి అవసరమైన భవనం, ఇంజన్‌కు నీటిని నింపుకోవడానికి వసతులు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎంపీడీవోకు సంబంధించిన పాత శిథిలావస్థ క్వార్టర్స్‌లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కనీసం క్వార్టర్స్‌లో మరుగుదొడ్లు, నీటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండకాలం వచ్చిందంటే ఫైర్ ఇంజన్‌లో నీటిని నింపుకోవడానికి చెరువుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎదురవుతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదికాక 2009 సంవత్సరంలో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని ఖాళీ చేయాలని సిబ్బందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. కాని చేసేదేమి లేక తప్పని పరిస్థితుల్లో పాత క్వార్టర్స్‌లోనే కాలం గడుపుతున్నారు. గతంలో 1999లో ఎంపీడీవో గ్రౌండ్‌లో ఎమ్మెల్యే గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో స్థలం కేటాయించి శిలాఫలకం వేశారు. ఆ స్థల వివాదం కోర్టు ఆధ్వర్యంలో ఉండడంతో మూలనపడింది. మళ్లీ ఒకసారి నిధులు విడుదలైన స్థలం లేకపోవడంతో నిధులు తిరుగుపయనమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం రూ.70 లక్షల చొప్పున రెండు సార్లు నిధులు పక్కాభవనం కోసం మంజూరు చేసింది. స్థలం లేకపోవడంతో నిధులు తిరుగుపయనమయ్యాయి. రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించడంలో అలసత్వం వహించడంతో మరోసారి నిధులు తిరుగుపయనమయ్యే ప్రమాదం ఉందని అగ్నిమాపక అధికారులు ఆవేదన చెందుతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని సిబ్బంది అధికారులను వేడుకుంటున్నారు.



ఉట్నూర్ అగ్నిమాపక కేంద్రం



గోపయ్య చెరువులో నుంచి నీటిని నింపుతున్న సిబ్బంది



కవర్ కప్పి ఉన్న శిథిలావస్థలో క్వార్టర్

### స్థలం కేటాయించాలి

ప్రభుత్వం అగ్నిమాపక కేంద్ర భవనం నిర్మించుకునేందుకు రూ.70 లక్షలు మంజూరు చేసింది. కాని పట్టణంలో రెవెన్యూ అధికారులు తమకు సరైన స్థలం కేటాయించకపోవడంతో రెండు సార్లు నిధులు తిరిగి వెళ్లాయి. ప్రస్తుతం మళ్లీ నిధులు వచ్చే అవకాశం ఉన్నాయి. స్థలం కేటాయిస్తే పక్కా భవనం కల నెరవేరుతుంది. స్థలం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ప్రస్తుతం ఉన్న పాత క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నది. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వేసవికాలంలో ఫైర్ ఇంజన్‌లో నీటి కోసం నానా తంటాలు పడుతున్నాం. చెరువు, కుంటల నుంచి నీటిని నింపుతున్నాం. అత్యవసర అవసరాలు ఏర్పడినప్పుడు నీటిని నింపడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించాలి. స్థలం కోసం స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలి.

-దుర్గం రాజలింగం, ఉట్నూర్ అగ్నిమాపక శాఖ అధికారి

### గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 17 : రైతులు, పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది తెలిపారు. ఆదివారం మండలంలోని దేవుల్‌నాయక్‌తండా, రఘుగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

### తాత్కాలికంగా రిలే దీక్షలు విరమణ

ఎదులాపురం, మార్చి 17 : ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద రైల్వే లైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఇందులో భాగంగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి దీక్షలో కూర్చున్న సాధన కమిటీ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగారెడ్డి, మహ్మద్ రఫిక్, రైల్వే సాధన కమిటీ సభ్యులు సిర్ర దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నార్నూర్, మార్చి 17 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ అన్నారు. ఆదివారం జామడ గ్రామంలోని ప్రభుత్వ సైన్స్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా భీమన్న పండుగ



పూజలు చేస్తున్న నాయకపోడ్ సంఘం సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని బీఎడ్ కళాశాల వద్ద నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భీమన్న పండుగ ఘనంగా నిర్వహించారు. నాయకపోడ్ కుల సంఘం సభ్యులు, ఉద్యోగులు భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, అధ్యక్షుడు గంగన్న, శ్రీనివాస్, నారాయణ, దివాకర్, లక్ష్మణ్, ప్రభాకర్, ఆశన్న పాల్గొన్నారు.

# మొక్కల పెంపకానికి సన్నద్ధం

- పదో విడుత హరితహారానికి ఏర్పాట్లు
- నార్నూర్, గాదిగూడ మండలాల్లోని నర్సరీల్లో వేల మొక్కలు పెంచాలని అధికారుల లక్ష్యం
- ఇప్పటికే పూర్తయిన బ్యాగ్‌ఫిలింగ్ పనులు



బలాన్‌పూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

నార్నూర్, మార్చి 17 : నార్నూర్, గాదిగూడ మండలాల్లో పదో విడుత హరితహారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హరితహారం ప్రారంభం నాటికి గ్రామాల్లో మొక్కలు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల వ్యాప్తంగా దాదాపు 5 లక్షల 28 వేల మొక్కల పెంపకానికి అధికారులు నర్సరీల్లో నిర్వహణ పనులు వేగవంతం చేశారు. ప్రతి నర్సరీలో బ్యాగ్ ఫిలింగ్ పనులు పూర్తి కాగా.. పలు నర్సరీల్లో విత్తనాలు విత్తి మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు.

### ప్రతి నర్సరీలో 11వేల మొక్కల పెంపకం...

రెండు మండలాల్లో 48 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో వన నర్సరీలు ఏర్పాటు చేసి అందులో మొక్కలు పెంచే పనులు ముమ్మరం చేశారు. ఈసారి హరితహారం ప్రారంభోత్సవం నాటికి ప్రతి నర్సరీలో 11వేల మొక్కలు అందుబాటులో ఉంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు ఆయా నర్సరీల్లో 20వేలకు పైగా మొక్కలు అందుబాటులో ఉండగా ప్రస్తుతం కొత్తగా 5,28,000 మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కానుగ, ఉసిరి, వేప, రావి, నల్లమద్ది, చింత, కరివేపాకు, జామ, సీతాఫలం, నేరేడు, దానిమ్మ, గన్నేరు, గులాబి, కాగితం పూల మొక్కల విత్తనాలు నాటేందుకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు.

### ఉపాధి హామీ పరిధిలో నర్సరీలు...

గ్రామాల్లో వననర్సరీలను ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నర్సరీలకు మట్టి తెప్పించిన అధికారులు కూలీలతో శుభ్రం చేయించి ప్లాస్టిక్ బ్యాగుల్లో నింపే పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం మట్టిని నింపిన బ్యాగులను నర్సరీల్లో వరుసగా పేర్చడం, విత్తనాలు నాటడం, నీరు పెట్టడం లాంటి పనులు చేయిస్తున్నారు. నర్సరీల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే కావడంతో కార్యదర్శుల పర్యవేక్షణలో వన సేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చకచకా పనులు చేయిస్తున్నారు.

### నిత్యం పర్యవేక్షిస్తున్నాం...

పదో విడుత హరితహారానికి నార్నూర్, గాదిగూడ మండలాల్లో 5లక్షల 28వేల మొక్కలు అందుబాటులో ఉంచాలని లక్ష్యం పెట్టుకున్నాం. 48 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకానికి ఏర్పాట్లు ముమ్మరం చేశాం. ఇప్పటికే ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టిని నింపి విత్తనాలు నాటించాం. ఈ పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

-జాదవ్ సురేశ్, ఈజీఎస్ ఏపీవో, నార్నూర్

నమస్తే తెలంగాణ CLASSIFIED
ఉచిత శిక్షణ–ఉపాధి
jobs Apply Now!
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహీంద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలి



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గంద్రత్ రమేశ్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 17 : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగుతూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గెలుపొందిన వాన్వాట్ జట్టుకు రూ.35 వేల నగదు, కప్, రన్నర్ ఆఫ్‌గా నిలిచిన పొన్నారి జట్టుకు రూ.25 వేల నగదు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఈ క్రీడాల ద్వారా స్నేహాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సెవ్వ జగదీశ్, రాజు, విజ్జగిరి నారాయణ, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లచ్చంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తాంసి(తలమడుగు), మార్చి 17 : తలమడుగు మండలం లచ్చంపూర్ గ్రామంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు క్రాంతికుమార్, గౌరవాధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల గజానన్, ఉపాధ్యక్షుడు మేకల దత్తు, సంయుక్త కార్యదర్శి రమేశ్, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నిర్మల్ చైన్‌గేట్, మార్చి,17: పట్టణంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ శైలాజాయనన్, ప్యాట్రన్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

### మానసిక సమస్యలపై హెల్ప్‌లైన్ ఏర్పాటు

ఎదులాపురం, మార్చి 17 : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు మానసిక సమస్యలపై హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలపై మానసిక ఒత్తిడి ఎక్కువ ఉంటుందని, ఈ తరుణంలో విద్యార్థులు ఆందోళనకు గురి కాకుండా మానసిక దృఢత్వంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులతో పాటు అందరికీ అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. సెల్ నంబర్ 9440488571, టోల్ ఫ్రీ నంబర్ 040–35717915ను సంప్రదించాలని సూచించారు.

### అంగన్‌వాడీ కేంద్రాల వేళలు మార్పు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి17: వేసవి నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల పని వేళలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో, పలు సంఘాల విన్నపం మేరకు పని వేళలు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్

నార్నూర్, మార్చి 17 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, స్నేహభావం పెంపొందుతుందని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్త గిరి, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకుడు రాథోడ్ సికిందర్, నాయకులు రాథోడ్ దత్తారాం, భిక్షపతి, కోరల మహేందర్, రాథోడ్ సుభాష్, హైమద్, చిన్నయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పేదలకు రంజాన్ కిట్లు అందజేత



రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 17 : రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలుండే పేదలు ఇబ్బందులకు గురికాకుండా ఉండేలా రేషన్ సరకులను పంపిణీ చేస్తున్నామని ఉమీద్ ఫౌండేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుర్తించిన పేదలకు రంజాన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు షౌకత్, ఖలీల్ అహ్మద్, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్ ద్వారా టెస్టు చేస్తున్న రూరల్ సీఐ ఫణిందర్

ఎదులాపురం, మార్చి 17 : జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలో, రూరల్, జైనథ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టు చేసి కేసులు నమోదు చేశామన్నారు. డ్రైవ్‌లో సీఐలు ఫణిందర్, ప్రణయ్‌కుమార్, ఎస్ఐలు ముజాయిద్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

### చిన్నపాటి గొడవలో నిండు ప్రాణం బలి

- ఇద్దరు నిందితులు అరెస్టు



అడ్లూరి రాజు(ఫైల్)

ఎదులాపురం, మార్చి 17 : చిన్నపాటి గొడవలో నిండు ప్రాణం బలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన అడ్లూరి రాజు(30) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాలాజీనగర్‌లో నివాసముంటున్న తల్లిదండ్రులను చూసి సాయంత్రం 7 గంటలకు తిరుగుపయనమయ్యాడు. వినాయక్‌చౌక్‌లోని వైన్స్ వద్ద తన బావమరిది సాగర్‌తో కలిసి మద్యం తాగాడు. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వినోద్, ప్రవీణ్ వీరి పక్కన కూర్చొని మద్యం సేవించారు. ఈ క్రమంలో కొంచెం పక్కకు జరగాలని కోరగా వారి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అనంతరం రాజు, సాగర్ అక్కడి నుంచి గాంధీపార్కు వైపు స్కూటీపై వెళ్తున్నారు. గొడవ మనుసులో పెట్టుకున్న వినోద్, ప్రవీణ్‌లు ఆటోలో వారిని వెంబండించి అడ్డుకొని దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే రాజుకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. గాయాలైన సాగర్‌ను స్థానికులు రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు ఆదివారం వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.